నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- అరకులోయ : అరుకులోని 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో ఈనెల 29న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావు తెలిపారు.

ఈ ఉపకేంద్రం పరిధిలోని అరకు (అంజోడ), సుంకరమెట్ట, హట్టగూడ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు అరకు వ్యాలీ మండలంలో అన్ని పంచాయతీల పరిధిలోని పెదలబుడు, చిన్న లబుడు, చొంపి, సుంకరమెట్ట, సిరగం, లోతేరు, మాడగడ, మాదల, బస్కీ ,బొండం, గన్నెల, ఇరగాయి, పద్మాపురం, కొత్త భల్లుగూడ, డుంబ్రిగుడ మండలం అరకు సంతబయలులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

1/70 చట్టం జోలికొస్తే ఖబడ్దార్!

★ స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతల ధ్వజం

★ శరభగుడలో నిరసన వ్యక్తం చేసిన మన్యవాసులు

★ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్

శరభగూడలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, స్థానిక గిరిజనులు

ప్రజాశక్తి- పాడేరు: ఏజెన్సీలో గిరిజన చట్టాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు తప్పవని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మండిపడ్డారు. 1/ 70 చట్టం అమలులో సడలింపులు ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు...

విశాఖపట్నంలో నిర్వహించిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో అసెంబ్లీ స్పీకర్అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండించిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం సవరణ ద్వారానే ఏజెన్సీ ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తాయని స్పీకర్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉండి, గిరిజనులకు హానికలింగేలా స్పీకర్ స్థాయిలో వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. స్పీకర్ వ్యాఖ్యలు ప్రభుత్వ వైఖరిగానే ఆదివాసీ సమాజం భావిస్తున్న నేపథ్యంలో దీనిపై తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఏజెన్సీ అభివృద్ధికి పర్యాటకరంగం ద్వారానే సాధ్యమనే తప్పుడు అభిప్రాయంలో కూటమి పాలకులు ఉన్నారని మండిపడ్డారు. ఏజెన్సీలోని సహజ వనరులు, సంపదను కార్పొరేట్ కంపెనీలో అప్పగించే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోందని, దీన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. 1/ 70 అమలులో నిర్లక్ష్యం వల్లే ఇప్పటికే వందలాది ఎకరాలను టూరిజం పేరిట ఆక్రమించారని, ఇపుడు చట్టాన్ని సడలిస్తే మన్యం మొత్తంగా ఆదివాసీలకు దూరమై కార్పొరేట్ల పరమౌతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ హక్కులను, ఆదివాసీచట్టాలను ధిక్కరించడమే అవుతుందన్నారు . ఏజెన్సీలో యువతకు ఉపాధి అవకాశాలు, చిన్నతరహా పరిశ్రమలను ఐటిడిఎ ద్వారా ఏర్పాటు చేయాలని కోరారు. మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు అడ్డుగా ఉందని 1/70చట్టానికి సవరణలు చేయాలని నాటి టిడిపి ప్రభుత్వం గిరిజన సలహా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అప్పట్లో ఉన్న ఒకేఒక సిపిఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య తీవ్రంగా వ్యతిరేకించడంతో అడ్డుకట్ట పడిందని గుర్తు చేశారు. మన్యవాసుల మనుగడకు నష్టం కలిగించే ఇటువంటి కుట్ర పూరిత విధానాలకు ప్రభుత్వాలు స్వసి చెప్పాలని హితవు పలికారు.

పర్యాటకాభివృద్ధి ముసుగులో 1/70 చట్టం సవరణ తగదు

పాడేరు : ఆదివాసీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటళ్ళు,రెస్టారెంట్లు, పార్కులు నిర్మాణం కోసం 1/70 చట్టానికి సడలింపులపై రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ధర్మన్న పడాల్ పొద్దు బాలదేవ్ తీవ్రంగా ఖండించారు. అయ్యన్న ప్రకటన ఆదివాసి హక్కులు, చట్టాలకు తీవ్రమైన విఘాతం కలిగించేలా ఉందని, ఆదివాసులకు ద్రోహం చేసే ఇటువంటి వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై ఆదివాసీల ఆందోళన

అరకులోయ :టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 చట్టం సవరణ చేయాలని సాక్షాత్తు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడం ఆదివాసుల హక్కులు చట్టాలకు తీవ్ర విఘాతం కలిగించడమే కాకుండా మన్యవాసులకు ద్రోహం చేయడమేనని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మండిపడ్డారు.. ఆదివాసీ అభివృద్ధి అంటే హోటళ్లు, రిసార్ట్స్ నిర్మాణం కాదని, కాఫీ, చింతపండు, అడ్డాకులు వంటి గిరిజన అటవీ వాణిజ్య ఉత్పత్తులకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, జిఒ3 ప్రయోజనాలను పునరుద్ధరించి, శతశాతం గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.
స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అరకులలోని శరభగుడలో నిరసన చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మండల నాయకులు కిల్లో జగన్నాథం మాట్లాడుతూ, ఆదివాసులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం సవరణ చేస్తే షెడ్యూల్ ప్రాంతంలోని అడవీసంపద, గనులు, ఖనిజాలు, ప్రకృతి అందాలన్నీ బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ కంపెనీల పరమౌతాయని, ఆదివాసుల జీవన విధానం, మనుగడ ప్రశ్నార్థకమౌతుందని ఆవేదన వెలిబుచ్చారు ఆదివాసీల హక్కుల పరిరక్షణలో గుండెకాయలాంటి 1/70చట్టంపై అయ్యన్న చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కిల్లో కేశవ్, భగవాన్, వంతల మోహన్, జన్ని కార్తీక్, కిల్లో మోహన్, బురిడి లక్ష్మణ్, కొర్రా సువర్ణరాజు, సోమేలి రాజు పాల్గొన్నారు.

సమన్వయంతో అరకు ఉత్సవం జయప్రదం

● ఏర్పాట్లపై సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

● 31 నుంచి మూడురోజుల పాటు నిర్వహణకు సన్నాహాలు

● ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లుకు సూచన

హెలీ టూరిజం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- అరకులోయ : అందరి సమన్వయంతో అరకు చలి ఉత్సవం-2025ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.ఈనెల 31,వచ్చేనెల 1, 2 తేదీలలో నిర్వహించే చలి అరకు ఉత్సవ్‌పై మంగళవారం హరిత రిసార్ట్‌లో అన్ని శాఖల అధికారులతో ఏర్పాట్లుపై సమీక్షించారు. ఏయే శాఖలు ఏయే పనులు చేపట్టాలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అరుకు చలి ఉత్సవంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
ట్రాఫిక్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రదర్శన స్టాల్స్, సౌండ్ సిస్టం, మారథాన్ ర్యాలీ, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవం మూడు రోజులు మెరుగైన పారిశుధ్యం పనులు చేపట్టాలని పంచాయతీ విభాగం అధికారులకు సూచించారు. అంతరాయం లేని విద్యుత్తు సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గిరిజన వంటకాలు ఏర్పాటు చేసి విక్రయించాలని సూచించారు. మొబైల్ సిగ్నల్ ఇబ్బందులు లేకుండా వీల్స్ ఆన్ సెల్ఫోన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. 31న డిగ్రీ కళాశాల నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వరకు, తిరిగి డిగ్రీ కళాశాల వరకు నిర్వహించే మారథాన్‌ను అలాగే బొర్రా జంక్షన్ నుంచి డిగ్రీ కళాశాల మైదానం వరకు సైకిల్ ర్యాలీని జయప్రదం చేయలన్నారు. హెలీ టూరిజం గోడపత్రికను ఆవిష్కరించారు.
అరకు ఉత్సవానికి 7 వేల నుండి పదివేల మంది పర్యాటకులు, ప్రజలు సందర్శిస్తారని, ఈ మేరకు ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు ఉండాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కె.వేణుగోపాల్, జి .డేవిడ్‌రాజు, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, గిరిజన మ్యూజియం క్యూరేటర్ మురళి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నందు, జిల్లా ఉద్యానవనాధికారి రమేష్‌కుమార్ రావు, ఐసిడిఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డిపిఆర్ఒ పి.గోవిందరాజులు, తాహసిల్దార్లు, ఎంపిడిఒలు, ఈవెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఏకే 47 మిస్ ఫైర్

- ఆర్ఎస్ఐ కాలికి గాయాలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏకే 47 తుపాకీ మిస్ ఫైర్ అయ్యి స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయమైంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు... సీలేరు పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ పార్టీకి కేటాయించిన రూములో రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ) కె.హరీష్ సోమవారం మధ్యాహ్నం ఏకే 47 శుభ్రపర్చే తుపాకీలో ఉన్న మ్యాగ్జిన్ బయటకు తీసి క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మిస్ ఫైర్ అయి ఆయన కుడికాలు పాదానికి తగిలింది. దీంతో ఆయన పాదానికి గాయం కాగా పోలీసులు హుటా హుటీన చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం సేవల నిమిత్తం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఏకే 47 తుపాకీలో మ్యాగ్జిన్ తొలగించే క్రమంలో ఒక రౌండ్ ఉండిపోవడంతో అది మిస్ ఫైర్ అయినట్లు విశ్వసనీ వర్గాల ద్వారా తెలిసింది. సోమవారం ఈ విషయాన్ని పోలీసులు బయటకు తెలియకుండా జాగ్రత్తలు వహించారు. అయితే మెరుగైన వైద్యం కోసం ఆర్ఎస్ఐ హరీష్‌ను విశాఖపట్నం తరలించడంతో ఎకె 47 మిస్ ఫైర్ సంఘటన వైరల్‌గా మారింది.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి ఏజ్ కటాఫ్ డేట్ పెంచాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాల కోసం విడుదల చేసిన ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్‌లో విద్యార్థుల వయస్సు కటాఫ్ డేటు పెంచాలని ఐటీడీఏ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించినట్లు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేయగా విద్యార్థి వయసు కటాఫ్ డేట్‌ను 2025 మార్చి 31గా ప్రకటించారని తెలిపారు. అయితే అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ కటాఫ్ డేటు ఇవ్వడం జరిగిందని, అయితే విద్యాహక్కు చట్టం 2009లోని ఆర్టికల్ 21ఏ సెక్షన్ 15 ప్రకారం అందరికీ ఉచిత నిర్బంధ విద్య అందించాల్సి ఉందని పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో ఇచ్చిన కటాఫ్ డేట్ ప్రకారం ప్రతి వంద మంది విద్యార్థుల్లో 9 మంది విద్యార్థులు ఎంట్రన్స్ రాసే అవకాశాన్ని కోల్పోతున్నారని తెలిపారు. గతంలో నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌కు 2025 ఆగస్టు 31 ఏజ్ కటాఫ్ డేట్‌గా నిర్ణయించారని, ప్రభుత్వం, అధికారులు స్పందించి ఏకలవ్య పాఠశాలల్లోనూ ప్రవేవానికి 2025 ఆగస్టు 31 వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

సంక్రాంతి సంబరాల్లో భాగంగా అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద నిర్వహించిన అల్లూరి సీతారామరాజు క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్ చివరి రోజు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు మఠం భాస్కర్ హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో సుమారు 60 టీములు పాల్గొనగా మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నర్స్ జట్టుకు ఉరూ.20 వేలు నగదు బహుమతులు, షీల్డ్ అందించారు. పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు తమ తల్లి కోటి బూరమ్మ జ్ఞాపకార్థం రన్నర్స్ షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.నరసింహమూర్తి, ఇన్స్పెక్టర్ బి.వినోద్, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలయోగి, వెంకటలక్ష్మి, జనసేన పార్టీ నాయకులు జయరాం తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే మట్టి ఖర్చుల జీవో

ప్రజాశక్తి-రంపచోడవరం

విధులలో ఉండి మరణించిన అంగన్వాడీ వర్కర్లకు మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం ఇవ్వడానికి ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) స్వాగతించింది. 42 రోజులు అంగన్వాడీల సమ్మె పోరాట ఫలితంగా ఈ జీవో విడుదల చేసిందని యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎమ్ .రాజేశ్వరి, బి.నిర్మల పేర్కొన్నారు. మంగళవారం జరిగిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ హామీ ఇచ్చిన దానికి అనుగుణంగా మట్టి ఖర్చులు రూ.15వేలును రూ.20 వేలుకు పెంచాలని కోరారు. 42 రోజుల పాటు సమ్మెలో భాగంగా మినిట్స్ రూపంలో కుదుర్చుకున్న మిగతా ఒప్పందాలను త్వరగా జీవో రూపంలో ఇచ్చి అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కారం రామలక్ష్మి, ఉపాధ్యక్షులు కొర్రపు రాణి, నాయకులు కె.వెంకటలక్ష్మి, సింగారమ్మ, సత్యవేణి, రత్నకుమారి, ప్రసన్న, కె.నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్

రికార్డులను తనిఖీ చేస్తున్న రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ పద్మావతి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ పద్మావతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి పనితీరును అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత ల్యాబ్‌ను, మందుల గదులను, గర్భిణి ప్రసవాల వార్డులను, బర్త్ వెయిటింగ్ హోమ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణిలు, బాలింతలు అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద కాకుండా, పిహెచ్‌సిలు, ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా వైద్యసిబ్బంది, ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌భాషా, స్థానిక వైద్యాధికారి పి రాంబాబు, వైద్య సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న బలపం సర్పంచ్ రమేష్ నాయుడు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని కోరుకొండ, చెరువూరు ప్రధాన రహదారి ఇటుకబెడలు గ్రామ సమీపంలోని లాగరాయి ప్రమాదకర మలుపు వద్ద సుమారు రూ.2.30 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ సూపర్వైజర్ కె.జయరాంతో కలిసి బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు మంగళవారంశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రహదారి గుండా ప్రయాణం చేయాలంటే ప్రమాదకర మలుపు వద్ద ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విశాఖపట్నం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ సంస్థ సిఎస్ఆర్ నిధులు రూ 2.30లక్షలు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు గబులంగి వీరయ్య దొర, కార్యదర్శి బచ్చలి చిట్టిబాబు, వైసిపి నాయకుడు బచ్చల బాబురావు, కూటమి నాయకులు బచ్చల నారాయణరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

విఒఎల సమస్యలను పరిష్కరించాలి

సామూహిక దీక్షల్లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

ఐటిడిఎ గేటు ఎదుట దీక్షల్లో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు టౌన్

వెలుగు విఒఎల ఆరునెలల వేతన బకాయిలు చెల్లింపు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. మంగళవారం ఐటిడిఎ ఎదుట వెలుగు యానిమేటర్లు కొనసాగించిన సామూహిక దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విపక్షంలో ఉన్నప్పుడు వెలుగు విఒఎల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పడం దుర్మార్గమన్నారు. విఒఎలంతా ఐక్యంగా పోరాడడం ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, విఒఎల సొంత ఖాతాలకు గౌరవ వేతనం జమ చేయాలని, వీరి సమస్యలపై జిల్లాలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, నినదించారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విఒఎలను ఆదుకోవాలని కోరారు. డ్వాక్రా గ్రూపులకు సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న వెలుగు విఒఎలకు కూటమి ప్రభుత్వం ఇచ్చే భద్రత ఇదేనా అని నిలదీశారు. తక్షణమే స్పందించి వెలుగు విఒఎల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళలను మరింత ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెలుగు విఒఎలతో ఈనెలాఖరులోగా చర్చిస్తామని చెప్పి ఇంతవరకు ఆహ్వానం పంపించలేదని మండిపడ్డారు. నిరసన దీక్షల్లో విఒఎల సంఘ జిల్లా అధ్యక్షురాలు ఆర్.భాను, ప్రధాన కార్యదర్శి ఎల్‌బి.రాజ్ కుమార్, కోశాధికారి పి.పోతురాజు నాయుడు, జికె వీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, ముంచింగిపుట్టు, పెదబయలు మండలాల నాయకులు, 226 మంది విఒఎలు దీక్షలో పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : వెలుగు విఒఎలకు సంబంధించిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ వెలుగు వివోఏల (యానిమేటర్స్) సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు భాగంగా చింతూరు డివిజన్ పరిధిలో విఆర్ పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల వివోఎలు 27, 28 తేదీలలో చింతూరు ఐటీడీఏ ముందు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం నాటి దీక్షలను వెంకట్, సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 నెలల నుండి బకాయి ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 28 వేల మంది వివోఏలు పొదుపు సంఘం మహిళలకు దీర్ఘకాలంగా సేవలందిస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం వివోఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను తీసుకొచ్చిందని, దాని ఉపాధికి రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, జండర్ పేరుతో తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. విఒఎల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, పిఎన్ఎం మండల నాయకులు పత్రా రమేష్, వివోఏ సంఘం నాలుగు మండల నాయకులు గొర్రె లక్ష్మయ్య, రత్తయ్య, దూలమ్మ, రత్నకుమారి, లీలావతి, దుర్గాదేవి, అనసూయ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వెలుగు విఒఎలు

31న డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

ప్రజాశక్తి-రంపచోడవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి), జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 31న శుక్రవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు 5 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మినీ జాబ్ మేళాలో పేటిఎం, బ్లింక్ ఇట్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలో 18 నుండి 35సంవత్సరాల మధ్య గల వయస్సు ఉండి, టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై చదువులు పూర్తి చేసిన యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు పాన్ కార్డు, ఆధార్ కార్డు, సరిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూల్లో ఎంపిక కాబడిన అభ్యర్థులకు నెలకు జీతం రూ.10వేలు నుండి రూ.16వేలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు www.naipunyam.ap.gov.in లేదా, 6304634447, 9398338105 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గాయపడ్డ భోజన కార్మికురాలికి పరామర్శ

- విద్యాశాఖ అధికారుల తీరుపై చిన్నయ్యపడాల్ ధ్వజం

లక్ష్మిని పరామర్శిస్తున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి- చింతపల్లి : విధి నిర్వహణలో పాఠశాలలో వంట చేస్తుండగా, కుక్కర్ పేలిన ప్రమాదంలో గాయపడిన లోతుగడ్డ పంచాయతీ చెరుకుంపాకలు పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికురాలు పసుపులేటి లక్ష్మి ఇంటి వద్దకు వెళ్లిసిఐటియు జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం చెరుకుం పాకలు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం వంటలో భాగంగా కుక్కర్‌లో పప్పు ఉడికిస్తుండగా అదిపేలడంతో వేడిగా ఉన్న పప్పు ముఖం నుంచి తలపై పడడంతో లక్ష్మి తీవ్రంగా గాయపడిందన్నారు.. తీవ్రంగా కాలిన గాయాలతో అక్మి ఇంటి వద్దనే వైద్యం చేయించుకుంటోందన్నారు. మండల విద్యాశాఖ అధికారులు పరామర్శలతోనే సరిపెట్టుకున్నారని, బాధితురాలిని ఆదుకునేందుకు గానీ, ఆమెకు సరైన వైద్యసేవలు అందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమన్నారు.దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చిన్నయ్యపడాల్ తెలిపారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగి, గాయాలు పాలైన సందర్భాల్లో సంబంధిత యంత్రాంగమే అన్ని చర్యలు చేపట్టాల్సిన పరిస్థితుల్లో మండల విద్యాశాఖ అధికారులు వ్యవహరించిన తీరు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: మండలంలోని కొర్ర పంచాయతీలో పశువైద్యశాఖ ఆధ్వర్యాన మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు, మేకలు, గొర్రెలకు డి వార్మింగ్ మందులను వేశారు. అనంతరం పశు వైద్యాధికారిని రాజశ్రీ మాట్లాడుతూ వాతావరణంలో కలుగుతున్న మార్పుల కనుగుణంగా మూగజీవులకు కూడా ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు , డి వార్మింగ్ మందులను వేస్తుండాలని, దానివల్ల వ్యాధులు సోకే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ పంచాయతీ సర్పంచ్ అర్జున్ ,ఎంపీటీసీ విజయలక్ష్మి, వైసిపి నాయకులు చిరంజీవి వెటర్నరీ అసిస్టెంట్ ఎస్ సుబ్బారావు, ఎహెచ్ఎలు జానకి, దివ్య పాల్గొన్నారు.

కూనవరం :మండలంలోని కూటూరు పంచాయితీ పరిధి ముల్లూరు గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సర్పంచ్ బొగ్గ వెంకమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, కట్టం ప్రభాకర్, సోడె నాగేశ్వరావు, టి.కన్నారావు వెంట్రామయ్య, బ్రమ్మయ్య, పశు వైద్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని శరభన్నపాలెం, నడింపాలెం గ్రామాలలో పశు వైద్యాధికారి డాక్టర్ కే రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 50 అనారోగ్య పశువులకు వైద్యం అందించారు. 104 పెద్ద పశువులకు, 29 పెయ్యలకు, 122 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, గొర్రెలకు కోళ్లకు రోగ నిరోధక టీకాలు వేశారు. శాస్త్రీయ యాజమాన్యం, మెలకువలు గురించి డాక్టర్ ప్రసన్న కుమార్ రైతులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో శరభన్నపాలెం సర్పంచ్ కే సత్యనారాయణ, ఉప సర్పంచ్ సంపరి త్రిమూర్తులు, జెబిఒ డి.అప్పల నరసమ్మ, వెటర్నరీ అసిస్టెంట్ డి శ్రీనివాస్, ఏహెచ్ఎలు పరమేష్, వెంకటరమణ, దేవుడు, సుశీల రైతులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడలో పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

బోసిపోయిన ప్రభుత్వ కార్యాలయాలు

అధికారులు, సిబ్బంది అందుబాటులో లేక సేవలకు అవస్థలు
పనులు జరగక నిరుత్సాహంగా వెనుదిరిగిన గిరిజనులు

మండల పరిషత్‌లో ఖాళీగా ఉన్న ఎంపిడిఒ, ఇతర కుర్చీలు

ప్రజాశక్తి-హుకుంపేట:మన్యంలో ప్రభుత్వ కార్యాలయాల పనితీరు నానాటికీ తీసికట్టుగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. హుకుంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఎంపిడిఒతోసహ కిందిస్థాయి సిబ్బంది వరకూ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. దీనిపై ఎటువంటి ముందస్తు సమాచారం లేకపోవడంతో వివిధ పనులపై వచ్చిన వారంతా కనీసం సమాధానం చెప్పే దిక్కులేక, అర్జీలైనా అందుకునే నాథులు లేక అసంతృప్తితో నిరుత్సాహంగా వెనుదిరిగారు.

మండల రెవెన్యూ కార్యాలయంలోనూ ఇంచుమించూ ఇదే పరిస్థితి. ఇక్కడ ఆర్ఐలు, విఆర్ఒలు తప్ప ఇతర అధికారులు లేకపోవడం శోచనీయం. మన్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించరని, మధ్యాహ్నం పూట అయితే అనేకమంది కుర్చీలను ఖాళీ చేసి పత్తా లేకుండా పోతారని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

భూదాతలకు న్యాయం చేయాలి

ఆందోళనకు సిపిఎం, కాంగ్రెస్ సంఘీభావం

ప్రజాశక్తి- దుంబ్రిగుడ:స్థానిక మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణానికి భూములిచ్చిన భూదాతలకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన ఆందోళన మంగళవారం ఆరవ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు,జిల్లా కమిటీ సభ్యుడు టి సూర్యనారాయణ దీక్షల్లో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎస్ బి పోతురాజు మాట్లాడుతూ ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి భూములు తీసుకొని ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే భూదాతలకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో భూ బాధితుల కుటుంబీకులు, టి రాందాస్ పాల్గొన్నారు.

భూదాతల ఆందోళనకు కాంగ్రెస్ సంఘీభావం

అప్ బాధితులకు సంఘీభావంగా నిరసనలో పాల్గొన్న సిపిఎం నేతలు

ఉద్యోగాలిచ్చి తమకు న్యాయం చేయాలని ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చిన దాతలు చేపట్టిన ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి సంఘీభావం తెలిపారు. దాతలకు న్యాయం కోసం ఆందోళనలో పాల్గొంటామన్నారుపార్టీ నాయకులు పరశురాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా విష్ణుమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చీడి విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించిన సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం.వి.రామకృష్ణ తెలిపారు. విశాఖలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ఎన్నికలు జరిగాయి. డాక్టర్ విష్ణుమూర్తి గత మూడు పర్యాయాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. డాక్టర్ విష్ణుమూర్తిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గీతం విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్) -2025లో భాగంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి పైగా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్, జిమ్సర్ బ్లడ్ బ్యాంక్ నిపుణులు హాజరై విద్యార్థులనుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా గీతం బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ పి.షీలా మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి రక్తం అందించడం ద్వారా ప్రాణాలు నిలుస్తాయన్నారు. ప్రస్తుతం అవసరాలను గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రక్తదాన కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సంషుద్దీన్, ఎస్.ఎస్.మిశ్ర, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- మాడుగుల : గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో పోతనపూడి అగ్రహారం గ్రామానికి చెందిన తర్ర శ్రీను మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటన్నర ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి తన స్వగ్రామం పోతనపూడి గ్రామానికి మోటారు బైక్ పై వెళ్తుండగా వీరనారాయణం సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీను రోడ్డు మీద పడడంతో తీవ్రగాయాలపాలై అకస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల గుర్తించి శ్రీను కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు రామ్‌కుమార్ గాయపడిన వ్యక్తికి వైద్య చికిత్స అందించిన అనంతరం తలకి బలమైన గాయం తగలడంతో స్కానింగ్ నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

హుండీ చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరు శివాలయంలో ఈ నెల 25 అర్ధరాత్రి జరిగిన హుండీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితున్ని పట్టుకుని చోరీకి గురైన నగదును స్వాధీనం చేసుకున్నామని ద్వారక క్రైమ్ ఎసిపి ఎ.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఎంవిపి క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. పూజారి విశ్వనాథ కాశీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరపగా శివాలయం వెనుక నివాసం ఉంటున్న తూముల హరికృష్ణ నిందితునిగా తేలాడన్నారు. సమావేశంలో క్రైమ్ సిఐ చక్రధర రావు, ఎస్ఐ ఎం.ఎ.రాజు పాల్గొన్నారు.

కేన్సర్‌లో మైటోకాండ్రియా పాత్రపై పరిశోధనలు

ప్రజాశక్తి -మధురవాడ : చిన్న పరిమాణం కలిగినప్పటికి, శరీరంలో ఉండే మైటోకాండ్రియాను కణానికి శక్తిని అందించే 'పవర్ హౌస్'గా విశ్వసిస్తారని అయితే కేన్సర్ వ్యాపించే అవకాశాన్ని నిర్ణయించడంలో మైటోకాండ్రియా కీలక సమాచారం కలిగి ఉంటుందని తమ పరిశోధనలో వెల్లడైందని యూనివర్సిటీ ఆఫ్ కాన్‌సాస్ కేన్సర్ సెంటర్ (యుఎస్ఎ) పరిశోధకుడు ప్రొఫెసర్ డేనీ ఆర్.వెల్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవ శాస్త్ర విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. కేన్సర్ సంబంధమైన మరణాలలో మెటాస్టాసిస్ అంటే కేన్సర్ వ్యాప్తి 90 శాతం పైగా కారణమవుతోందని, అయినప్పటికి దీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకోవడానికి ఇప్పటి వరకు ప్రపంచదేశాలలో సరైన ప్రయత్నం జరగలేదని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ వెల్ మాట్లాడుతూ, కేన్సర్ సంబంధిత మరణాలలో మెటాస్టాసిస్ ప్రధాన కారణమని వివరించారు. కేన్సర్ వ్యాప్తి ప్రక్రియ కణాల అంతర్గత లక్షణాలు, కేన్సర్ కణాలు, వివిధ సూక్ష్మపర్యావరణాల మధ్య జరిగే సంక్లిష్టమైన పరస్పర ప్రభావాలతో ముడిపడి ఉందని వివరించారు. కేన్సర్ మెటాస్టాసిస్‌లో మైటోకాండ్రియల్ జన్యుపరమైన పాత్రను వివరించి, ఈరంగంలో ఇటీవల జరిగిన పరిశోధనలను ఆయన పస్తావించారు. మైటోకాండ్రియల్ డిఎన్ఎ కేన్సర్‌లో ఏ విధమైన పాత్ర పోషిస్తుందో మంచి అవగాహన కలిగితే, రాబోయే రోజుల్లో వ్యక్తిగత, వైద్య చికిత్సలకు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ అధ్యయనాలు కేన్సర్ చికిత్సా విధానాలను మెరుగుపరిచే మార్గాన్ని సూచిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరై కేన్సర్ పరిశోధన, భవిష్యత్తు, వైద్య రంగంలో వచ్చే కొత్త చికిత్స గురించి చర్చించారు.

ములాఖత్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీలను కలిసేందుకు ఇచ్చే ములాఖత్ ఇక నుంచి ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి మహేష్ బాబు తెలిపారు. ఇంతక ముందు కారాగారంలో ములాఖత్ ద్వారా ఖైదీలను కలవాంటే కేంద్రకారాగారానికి వచ్చి ప్రవేశద్వారం వద్ద ఉన్న కార్యాలయంలో తగిన ఆధారాలతో రిజిస్టర్ చేసుకొని అనంతరం ఖైదీలను కలిసేవారని, ఇప్పుడు ముందుగానే తమ ఇంటి నుంచే ఈప్రిజన్ ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని కోరిన రోజు కారాగారానికి రావచ్చని పేర్కొన్నారు. దీంతో పాటు ఈ- ములాఖత్ విధానంలో వీడియోకాల్ ద్వారా ఖైదీలు వారానికి రెండుసార్లు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

స్వచ్ఛందంగా నిర్మించుకున్న కమ్యూనిటీ హాలు

స్వచ్ఛందంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు

ప్రజాశక్తి-విఆర్.పురం : విఆర్ పురం మండలంలోని నాలుగు గ్రామాలు గుల్లేటివాడ, దారపల్లి, నూతిగూడెం, తేలవారిగూడెంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా గుల్లెట్‌వాడ కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకోవడం జరిగింది. ఈ హాళ్లను స్థానిక ప్రజలు మీటింగులు పెట్టుకోవడమే కాకుండా, వివిధ సమూహాల కార్యకలాపాలకు, వినియోగిస్తున్నారు. నూతిగూడెం గ్రామంలో అంగన్వాడీ పరిసరాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగంగా పిల్లలకు అవసరమైన డ్రైనేజ్ పనులను శుభ్రం చేయించారు. కనెక్టింగ్ డ్రైనేజ్ నిర్మించారు. ఎస్‌డిఎస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ గాంధీ బాబు, ప్రాజెక్ట్ మేనేజర్ చల్లారి సాయి చైతన్య, క్లస్టర్ కో ఆర్డినేటర్ ఎన్ రవి, ఎస్ నాగమణి, గూంజ్ సంస్థ నుండి తిరుపతిరావు మాట్లాడారు. గ్రామస్తులకు రూ.5,70,000 విలువగల నిత్యవసర సరుకులు, బట్టలు కిట్ల పంపిణీ చేశారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు : ప్రజలు కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న గంగవరం గ్రామాన్ని మంగళవారం సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో గిరిజనులకు కుష్టు వ్యాధిపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చ కుష్టు వ్యాధి కావచ్చుని, ఈ వ్యాధిని సకాలంలో గుర్తించడం వల్ల సులభంగా నయం చేసుకోవచ్చని చెప్పారు. శరీరంలో స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వైద్యాధికారిని సంప్రదించాలన్నారు. అనంతరం చిన్న గంగవరం ఎగువ వీధిలో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని తెలుసుకొని, అక్కడకు వెళ్లి జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించి ప్రాథమిక చికిత్స అందించారు. జ్వర బాధితుల్లో మలేరియా నిర్ధారణ కాలేదు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ఇద్దరు గిరిజనులను దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి నాగమణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : వాహనదారులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని వెహికల్ ఇన్‌స్పెక్టర్ అన్నారు. విఆర్.పురం మండల కేంద్రం రేఖపల్లి క్రికెట్ స్టేడియంలో ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంసేవించి వాహనాలు నడిపినా, అతివేగంగా నడిపినా, నియమ నిబంధనలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, హెల్మెట్ పెట్టుకోకుండా వాహనం నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపి ప్రమాదానికి గురైతే కుటుంబం మొత్తం ఇబ్బందులు పడుతుందని పేర్కొన్నారు. ఆటో, టాటా మ్యాజిక్ వాహనాలు నడిపే క్రమంలో ఎవరైనా ప్రమాదం బారిన పడితే వెంటనే సహాయం చేయాలని, గోల్డెన్ అవర్లో గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తీసుకువస్తే రివార్డు, ప్రశంసపత్రం ప్రభుత్వ పరంగా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. స్థానిక పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎఎస్ఐ రాధాకృష్ణ మాట్లాడుతూ మ్యాజిక్ డ్రైవర్లు ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్, వాహనాల డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన చీమల వెంకటేశ్వర్లు (వెంకన్న)కు ఆర్టీవో రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. అలాగే రేఖపల్లి నుండి కూనవరం మండల జగ్గవరం జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం పోలీస్ సిబ్బంది, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది, వందలాది వాహనదారులు పాల్గొన్నారు.

హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయుల కొరత

పూర్తి కాని టెన్త్ సిలబస్
ఆందోళన చెందుతున్న జెడ్‌పి హైస్కూల్, ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం జూన్ నుంచి ఇంగ్లీష్, హిందీ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు 204 మంది, బాలికల ఆశ్రమ పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు 286 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. బాలికల ఆశ్రమం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 37 మంది ఉండగా, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 33 మంది ఉన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్ బోధన చేయడానికి ఈ రెండు పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు లేరు. దీంతో ఈ విద్యార్థులు ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల్లో వెనుకబడి పోతున్నామని ఆందోళన చెందుతున్నారు.

ఈ ఏడాది మార్చి 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. హిందీ, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు లేక పదో తరగతి విద్యార్థులకు ఆ సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తి కాలేదు. దీంతో పబ్లిక్ పరీక్షల్లో హిందీ, ఇంగ్లీష్ పరీక్షలు ఎలా రాయాలోనని విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అవుతామని భయాందోళన చెందుతున్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. హిందీ, ఇంగ్లీష్ పరీక్షల్లో తమ పిల్లలు ఫెయిల్ అయితే దానికి పూర్తి బాధ్యత విద్యాశాఖ అధికారులు వహించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూరగాయల సాగుపై గిరి రైతు దృష్టి

సాగునీటి సౌకర్యం కల్పించాలని వేడుకోలు

గిరి రైతు గెన్ను సాగు చేస్తున్న పంట

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపు గ్రామానికి చెందిన గిరిజన రైతు వంతల గెన్ను కూరగాయల సాగుపై దృష్టి సారించారు. తన ఇంటి పరిసరాల్లో ఎకరాకుపైగా విస్తీర్ణంలో ముల్లంగి, తోటకూర, కొత్తిమీర, వంకాయలు, చిక్కుళ్ళు, టమాట, అంతర్ పంటగా మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తున్నారు. వాటి నుంచి వచ్చిన ఫలసాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తోటకూర, ముల్లంగి, కొత్తిమీర వంటి పంటలు కోత దశకు రావడంతో వాటిని తీసి కట్టలు కట్టి ఒక కట్ట రూ.20 చొప్పున స్థానిక పోలీస్ స్టేషన్, సిఆర్‌పిఎఫ్ మెస్సుకు, మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు, వివిధ పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఈ పంటలు సేంద్రియ ఎరువులతో పండించడం వలన కొనుగోలుదారులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు.

సాగునీటికి ఇబ్బందులు

ఎక్కువ శాతం కూరగాయలు పంటలు సాగు చేయడానికి నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని గిరిజన రైతు వంతల గెన్ను తెలిపారు. కుటుంబ పోషణకు ఏం చేయాలో తెలీక వీధి కుళాయిల ద్వారా వచ్చే నీటిని ఇంటి అవసరాలు తీర్చుకోగా మిగిలిన నీటిని స్టోరేజ్ చేసుకుని వాటి ద్వారా కొంతమేరకు ఆకుకూరలు, కూరగాయలు పండించగలుగుతున్నట్లు ఆయన చెప్పారు. గత ఏడాది అధికంగా తుపాన్లు రావడంతో సాగు చేసిన మినప పంట, ఆకుకూరలు, కాయగూరలు పంటలు దెబ్బ తిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ పంట పొలాల్లో బోరు బావులు ఏర్పాటు చేస్తే క్యాబేజీ, కాలీఫ్లవర్, బీట్‌రూట్, క్యారెట్, బంగాళదుంపలు తదితర పంటలు సాగు చేస్తామని చెప్పారు. ఆ దిశగా ఐటిడిఏ పిఒ, కలెక్టర్ దినేష్ కుమార్ స్పందించి పంట పొలాల్లో బోరు బావులు ఏర్పాటు చేయాలని పలువురు గిరిజన రైతులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న వెంకటేశ్వరరావు, చిత్రంలో గంగరాజు తదితరులు

రామన్నకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : ఇటీవల ప్రమాదానికి గురై చేతిని కోల్పోయిన ప్రజాశక్తి అనంతగిరి విలేకరి జె.రామన్నకు సంస్థ ఆర్థిక సాయమందించింది. ఈ మేరకు ప్రజాశక్తి సాహితీ సంస్థ తరుపున రూ.10 వేలను జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరావు అందజేశారు. తొలుత అనంతగిరి మండలంలోని రామన్న స్వగ్రామమైన రాజుపాకకు వెళ్లి రామన్నను, కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, పంచాయతీ మాజీ సర్పంచి దీసరి లచ్చు, ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి కె.అప్పలనాయుడు, ఎడివిటి ఇన్‌ఛార్జి రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేయరూ..

ప్రజాశక్తి-కొయ్యూరు : కొమ్మిక పంచాయతీ పరిధి మారుమూల రెవిన్యూ గ్రామమైన కిత్తలోవ రహదారికి మరమ్మతులు చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ గ్రామానికి మూడు కిలోమీటర్ల మేరకు కొన్నేళ్ల క్రితం వేసిన తారు రోడ్డు పూర్తిగా పెచ్చులూడిపోయి, శిథిలమై మట్టిరోడ్డును తలపిస్తోంది. దీనికి కొంత కాలంగా ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో రహదారి పూర్తిగా అధ్వానంగా ఉంది. దీంతో రోగులు, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. తమ గ్రామాన్ని ఆనుకొని సుమారు 350 ఎకరాల వరకు జీడీ మామిడి తోటలు ఉన్నాయని, వాటి ఫలసాయం బయటకు తరలించాలన్న ఇదే మార్గమని పేర్కొన్నారు. ఈ రహదారి పూర్తిగా దెబ్బ తినడంతో వ్యవసాయ ఫలాలను మైదాన ప్రాంతాలకు తరలించడానికి తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారి మరమ్మతులు చేపడతామని చెప్పారుగాని ఇప్పటికీ ఎటువంటి మరమ్మతులు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని పీసా కమిటీ ఉపాధ్యక్షులు కొప్పు దేముడు, కూటమి నాయకులు కినబరి సన్యాసిరావు, కూడా కర్రయ్య గ్రామస్తులు కూడా చిన్నారావు, కూడా రాంబాబు, కూడా జోగిరాజు, కూడా రామకృష్ణ కోరారు.

ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధి గండి కొత్తగూడెం గ్రామంలో కొండరెడ్లుకు మంజూరైన గృహాల నిర్మాణానికి ఆ పంచాయతీ సర్పంచ్ నాగమణి, ఎంపిటిసి అమ్మాజీ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిగా వెనుకబడిన కొండరెడ్లు కోసం చింతూరు ఐటిడిఏ ద్వారా 13 కొత్త గృహాలు మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులు పూర్తి శ్రద్ధతో నాణ్యత ప్రమాణాలతో త్వరగా ఈ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఇళ్లు మంజూరు చేసిన చింతూరు ఐటిడిఏ పిఒ అపూర్వ భరత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి-కొయ్యూరు : జాతీయ ఉపాధి హామీ చట్టం కింద పనులు కొయ్యూరు మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని పనసలపాడు, నడింపాలెం, ఎం.మాకవరం మారుమూల బూదరాళ్ల పంచాయతీలోని నూకరాజు తోట తదితర గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ వేతనదారులు, భూమి చదును పనులు చేశారు. వలసలు నివారించే విధంగా జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో ఎస్కేవీ ప్రసాద్, ఉపాధి హామీ పథకం ఏపీవో బీ.శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించాలని సూచించారు.